క్లుప్తంగా



ఎన్నికల ఫలితాల అనంతరం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం కలిశారు.

- నర్సీపట్నం

రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: రెవెన్యూ పరమైన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడంతోపాటు విద్యార్థుల కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు పెండింగ్ లేకుండా చేయాలని తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంతవరకు ఎన్నికల ప్రక్రియలో ఉన్నామని, గురువారం సాయంత్రంతో కోడ్ ముగిసిందన్నారు. ఇక నుంచి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ పరమైన సమస్యలపై తన కార్యాలయానికి వచ్చే రైతులను ఇబ్బంది పెట్టకుండా పని చేసి పంపించాలన్నారు. ప్రజల నుంచి కార్యాలయ సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే చర్యలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్లో పెండింగ్ సమస్యలను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు



పశువులకు హెచ్‌ఎస్ టీకాలను వేస్తున్న సాయికుమార్

కె.కోటపాడు: ఆర్నెల్లు పైబడిన ఆవులు, గేదెల్లో గొంతువాపు వ్యాధి రాకుండా ఉండేందుకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ పశుసంవర్ధకశాఖ ద్వారా ఉచితంగా వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో 120 ఆవులకు, గేదెలకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేశారు. వర్షాకాలంలో ఆరుబయట లేత పచ్చగడ్డిని పశువులు మేతగా తీసుకోవడం వల్ల బ్యాక్టీరియా సంక్రమించి గొంతు కింద వాపు వస్తుందన్నారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం, నోటంట నురుగ రావడం, మేత తక్కువగా తినడం, వంటి లక్షణాలు వస్తాయన్నారు. ఈ కారణాలతో పశువుల నుంచి పాల దిగుబడి తగ్గే అవకాశాలున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా పశువులకు హెచ్‌ఎస్ టీకాలను ముందస్తుగా వేయించి వ్యాధి బారిన పడకుండా చర్యలను తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్చాలి



జి.కొత్తపల్లిలో దివ్యాంగుని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో

చీడికాడ: ఇంటి వద్దే ఉంటున్న 20 మంది దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈవో బొంజుబాబు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో 0 నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులను గుర్తించారు. ఇందులో భాగంగా జి.కొత్తపల్లిలో సర్వేను శుక్రవారం ఎంఈవో పరిశీలించారు. అక్కడ దివ్యాంగ చిన్నారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. భవిత కేంద్రంలో చేర్పించాలన్నారు. మండలంలోని గుర్తించిన మైల్డ్, మోడరేట్ దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించాలని భవిత ఉపాధ్యాయులు సరస్వతి, దేముడుబాబులకు సూచించారు.



గొలుగొండ: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఏఎస్ఐ పూర్ణచంద్రరావు



మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రంథాలయంలో చిన్నారుల బుక్ రీడింగ్



రోలుగుంట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో జానుప్రసాద్, గ్రంథాలయాధికారి వరలక్ష్మి

విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు

- ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



నర్సీపట్నం: విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎంఈవో నాగేంద్ర

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. వేసవి సెలవుల్లోనే కాకుండా అవకాశం ఉన్న ప్రతిదినమూ గ్రంథాలయానికి విచ్చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో జి.వి.డి. నాగేంద్ర, గ్రంథాలయ అధికారి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో నాగేంద్ర మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. తాను గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకుని ఉద్యోగం సాధించామన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువు మనల్ని ఉన్నత స్థానంలో నిలబెడుతుందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరానికి సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయుడు కె.వి.సుబ్బారావు, ఉపాధ్యాయులు రాంకుమార్, ఎం.లక్ష్మి, చుక్క రాము, సమ్మర్ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

రోలుగుంట: శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు గ్రంథాలయాధికారి ఎస్. వరలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవుల సమయంలో గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసి, చదువుట, రాయుట, వ్యాసరచన, చెస్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఇటుపైనా విద్యార్థులు పాఠశాలల పునః ప్రారంభం తర్వాత సెలవు దినాల్లో గ్రంథాలయాలకు వచ్చి ఇక్కడ పాఠ్య, పోటీ పరీక్షలు, తదితర పుస్తకాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. గ్రంథాలయ సిబ్బంది వి. శృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో భాగంగా విద్యార్థులకు, చిన్నారులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

గొలుగొండ: గ్రంథాలయాల వల్ల విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని, వాటిని వినియోగించుకోవాలని ఏఎస్ఐ పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు నెల రోజులపాటు ఇక్కడికి వచ్చి బుక్ రీడింగ్, ఆటలు, పాటలు నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గ్రంథాలయాలను వినియోగించుకొని మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని కోరారు. గ్రంథాలయ అధికారి రాజుబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో విజ్ఞాన కాంతులు నింపేందుకు దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారిణి వి. ఉషారాణి అన్నారు. లైబ్రేరియన్ ఓ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయ ఆవశ్యకతను విద్యార్థులకు పాఠకులకు వివరించారు. కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కొటాన రాంబాబు మాట్లాడుతూ వేసవి శిబిరాలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీల విజేత విద్యార్థులకు ఎంఈవో బహుమతులు అందజేశారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంథాలయాధికారి ఓ. శ్రీనివాసరావును అభినందించారు. ఉపాధ్యాయులు వరదపురెడ్డి రమణ, కాటపల్లి సందీప్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల 15వ తేదీన ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. డ్రాయింగ్, క్విజ్, తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన 30 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశామని గ్రంథాలయాధికారి వై వెంకటేశ్వర్లు తెలిపారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనువాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, పంచాయతీ ఈవో సీహెచ్. నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల: బహుమతులు పొందిన విద్యార్థులు



దేవరాపల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో ఉషారాణి

వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం



మినప పంటలో గొప్పులు తవ్వుతున్న కూలీలు

రోలుగుంట: ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రెండు వారాలుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలతో ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. ఈ వర్షాలతో భూముల్లో పదును ఉండడంతో జె.పి.అగ్రహారం, అడ్డసరం, వడ్డిప తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో లోతు దుక్కులు చేసి సరుగుడు, తదితర మొక్కలు నాటారు. రోలుగుంట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, కొండపాలెం తదితర గ్రామాల్లో చెరకు నాట్లు వేసుకున్నారు. భోగాపురం, కంచుగుమల, కొవ్వూరు. కె.నాయుడుపాలెం తదితర గ్రామల్లో పెసలు, బొబ్బర్లు, మినప తదితర అపరాల సాగు విస్తారంగా చేపట్టారు. ఆయా పంటల్లో వర్షాలకు కలుపు మొక్కలు అధికంగా పెరగడంతో గొప్పులు తవ్విస్తున్నారు. ఈ పనుల చేయడం వల్ల భూములు గుల్లబారి మొక్కలకు సమృద్ధిగా గాలి తగులుతుంది. ఎరువులు నేలలో మొక్కల మొదళ్లకు చేరుతాయి. మొక్కలు ఏపుగా ఎదిగి త్వరితగతిన పంట చేతికి వస్తుందని చెబుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 199 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,150	5,150
రెండో రకం	3,050	4,250
మూడోరకం	3,500	3,940

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు



ఆలయానికి వంటపాత్రలు, గ్యాస్ స్టౌ అందజేస్తున్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ నరసింహరావు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది గ్రామాలకు చెందిన వాసవీ క్లబ్ మహిళలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్నారులకు, మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాసవీ జిల్లా గవర్నర్ వై. నరసింహరావు, ఉప గవర్నర్ మధు, వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. క్లబ్‌కు వంటపాత్రలు, గ్యాస్ స్టౌను గవర్నర్ నరసింహరావు అందజేశారు. స్థానికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు. కింతలి–గాదిరాయి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, కోశాధికారి పుట్టా కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ కొట్యాడ గున్నయ్యశెట్టి, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, రావాల సతీష్, పుట్టా మురళీకృష్ణ, తవ్వా సన్యాసిశెట్టి, వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ వనిత సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు

ఉపాధి పనులు జోరందుకున్నాయి. కశింకోట మండలంలో ఈసారి రూ.10 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు అధికారులు లక్ష్య నిర్దేశం చేసుకున్నారు. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, పనులు నిర్వహిస్తున్నారు. చెరువులు, కాలువల్లో పూడిక తొలగింపులతో పాటు, చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతుల పండ్ల తోటలకు రింగ్‌ట్రెంచ్ పనుల్ని చేపడుతున్నారు.

- రూ.10 కోట్ల విలువైన పనులు చేపట్టడమే లక్ష్యం
- సాగునీటి వనరుల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- ఉపాధి పనుల్లో రింగ్ ట్రెంచ్‌ల తవ్వకాలు



అడ్డాంలో రైతు భూమిలో జీడిమామిడి మొక్కలకు రింగు ట్రెంచ్‌లు తవ్వుతున్న ఉపాధి కూలీలు



జెట్టపురెడ్డితునిలో తవ్విన వ్యవసాయ చెరువు



విసన్నపేటలో కొబ్బరిచెట్లకు తవ్వుతున్న రింగు ట్రెంచ్‌లు

కశింకోట: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు మాసాలుగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా సాగునీటికి ఉపయోగపడే పనులు చేపడుతున్నారు. ఇప్పటికే నిర్ణీత బడ్జెట్ మేరకు సగం వరకు పనులు జరిగాయి. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పూడిక తొలగింపులకు ప్రాధాన్యం

మండలంలో 27 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులు చేపట్టారు. దీనిలో భాగంగా సాగు నీటి చెరువుల్లో పూడిక తీతలు, కందకాల తవ్వకాలు, మట్టి రోడ్ల నిర్మాణం, వ్యవసాయ చెరువుల తవ్వకం, గెడ్డలు, నదుల నుంచి పూడిక తీయగా వచ్చిన మట్టితో రక్షణ గట్లను పటిష్టం చేయడం తదితర పనులు చేస్తున్నారు. పంట భూములకు సాగునీటి సరఫరా మెరుగుపడేలా పంట కాలువలను పునరుద్ధరిస్తున్నారు. పిచ్చిమొక్కలు, పూడిక తొలగించి, గట్లను పటిష్టం చేస్తున్నారు.

నీరు నిలిచేలా రింగ్‌ట్రెంచ్

ఈసారి రైతులు తమ భూముల్లో పెంచుకునే జీడిమామిడి, మామిడి, కొబ్బరి తదితర మొక్కలకు చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండేలా పాడి(రింగ్ ట్రెంచ్) తవ్వకాలపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే సుమారు 30 ఎకరాల భూముల్లో వీటిని తవ్వారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు పెంచుకునే పండ్ల జాతి మొక్కలకు రింగ్ ట్రెంచ్‌లు ఉచితంగా తవ్వుతున్నారు. దీనివల్ల మొక్క మొదలు ప్రాంతంలో నీరు నిల్వ ఉండి పంట దిగుబడి పెరిగేందుకు దోహదపడుతుంది. అచ్చెర్ల, అడ్డాం, విసన్నపేట తదితర గ్రామాల్లో రింగు ట్రెంచ్‌ల తవ్వకాల పనులు జోరుగా సాగుతున్నాయి.

ఖరీఫ్ సాగునీటికి ధీమా

కశింకోట, వెదురుపర్తి ప్రాంతాల్లో కాశీమదుం, ఉమ్మలాడ ఆనకట్టల ద్వారా పంట పొలాలకు నీరు వచ్చేలా సాగునీటి పంట కాలువలను తవ్వారు. ఉపాధి పనుల్లో భాగంగా గడ్డి, తుప్పలు, చెత్త తొలగించి శుభ్రం చేశారు. దీంతో ఖరీఫ్‌లో పంట భూములకు అవసరమైన సాగునీరు పుష్కలంగా అందగలదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనుల నిర్వహణ వల్ల ఉపాధి కూలీలకు సమృద్ధిగా పని లభిస్తోంది. ఎండ దెబ్బ తినకుండా తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నారు.

రూ.10 కోట్ల ఉపాధి పనులు

మండలంలో ఈ ఏడాది రూ.పది కోట్ల మేర ఉపాధి పనులు చేపట్టేందుకు లక్ష్య నిర్దేశం చేసుకున్నాం. ఆ మేరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పంచాయతీల పరిధిలో పనులు నిర్వహిస్తున్నాం. రోజుకి సుమారు 5 వేల మంది పని చేస్తున్నారు. మే 25 వరకు చెల్లింపులు జరిగాయి. రూ.280 వరకు కూలి పనిని అనుసరించి చెల్లిస్తున్నాం. వారానికి రూ.87 లక్షల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ ఏడాది చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు పెంచుకునే పండ్ల తోటల్లో మొక్కలు, చెట్లకు రింగ్ ట్రెంచ్‌ల తవ్వకాన్ని చేపడుతున్నాం.

– శివ, ఏపీవో, ఉపాధి హామీ పథకం, కశింకోట

మొక్కలతో వాతావరణ కాలుష్య నియంత్రణ

- ఎంఈవో జానుప్రసాద్



మొక్కలు నాటుతున్న ఎంఈవో జానుప్రసాద్, గ్రంథాలయాధికారి వరలక్ష్మి

రోలుగుంట: మొక్కలు నాటి తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్ తెలిపారు. స్థానిక గ్రంథాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వేప, కానుగ, నేరేడు తదితర జాతుల మొక్కలను విద్యార్థులతో కలసి నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మనం నాటిన మొక్కలు మనం విడిచిన కార్బన్‌డై–ఆక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందన్నారు. ఆ ఆక్సిజన్‌నే మన ప్రాణవాయువు అన్నారు. విద్యార్థులు గమనించి తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి వృక్ష సంపదను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి, రోలుగుంట కాంప్లెక్స్ సీఆర్పీ పరవాడ సతీష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కందిగెడ్డ వంతెన



రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెన ప్రాంతం

కె.కోటపాడు: మండలంలో గవరపాలెం–కె.జె.పురం గ్రామాల మధ్య కందిగెడ్డ వంతెన ప్రమాదభరితంగా మారింది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెనపై కె.కోటపాడు మండల ప్రజలు విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ మలుపు ఉండడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేకపోతున్నారు. దాంతో వాహనాలను నియంత్రించలేక వంతెన పై భాగంలో రక్షణ గోడలు లేని వైపు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు రక్షణ గోడలు త్వరితగతిన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

10 నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచారం

పాయకరావుపేట: ఈ నెల 10 నుంచి 25 వ తేదీ వరకు ఇంటింటికీ ధర్మప్రచారం నిర్వహించనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ ఖండ సంయోజకులు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. ఎస్.నర్సాపురంలోని కృష్ణ మందిరంలో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆలయాల్లో ప్రతి వారం భజన, హారతి కార్యక్రమాలు జరిపించాలన్నారు.

కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

మునగపాక: అన్నదమ్ముల మధ్య వివాదం కారణంగా శెట్టిబలిజ పెద్దలు తమను కుల బహిష్కరణ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ విషయమై ఎస్పీ,డీజీపీలకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నా రు. మండలంలోని టి.సిరసపల్లి శివారు రామారాయుడుపేటకు చెందిన కుందిరి దేముడు, చినతల్లి దంపతులు మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దేముడు కుటుంబానికి సంబంధించి అన్నదమ్ముల మధ్య 15 ఏళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దేముడు కుమారుడు పరదేశినాయుడును అడ్డం పెట్టుకుని వివాదాలు జరిగేవి. విషయం తెలుసుకున్న శెట్టిబలిజ కుల పెద్దలు రాము, రాజులు దేముడు కుటుంబ సభ్యులు ఉంటున్న ఇంటికి మూడు రోజుల క్రితం తాళం వేసి కుల బహిష్కరణ చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మునగపాక పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దేముడి ఇంటి తాళం తీసి వారికి రక్షణగా నిలిచారు. తరు వాత రోజున మళ్లీ కుల పెద్దలు అదే ఇంటికి తాళం వేసి తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని అనకాపల్లి ఎస్పీ, డీజీపీల దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు.